

నవ్యకళ వారి "మీరాబాయి"లో
ధ్యానమూర్తి 'మీరా'

# ఆ పిలుపు

"విద్యాప్రవీణ"

పీపుల్సుపార్కు చిన్నదయినా అందుబాటులో వుండేవారు మాత్రం కాలినడకను వస్తూవుంటారు...

ఆనాడు మధ్యాహ్నం కాలేజీకి సెలవువచ్చింది, లెక్చరర్ని తిట్టుకుంటూ గదికి చేరాను. నాటికి పరీక్షలు రెండునెల్లున్నాయి. కోర్సు, పుస్తకాలు లెఖ్ఖచూచుకుంటున్నాను. కొన్ని శాస్త్రీలే గల్లంతయ్యాయి. ఆసమయంలో "ఫిలింఇండియా" క్రిందటి సంవత్సరం సంచిక చేతికివచ్చింది. ఎగరవేస్తే అర్ధనగ్ననారీ సందర్శనం అయింది. తల దిమ్మెత్తింది. గదికి తాళంవేసి పార్కుకివెళ్ళాను. ఆలోచిస్తూవుంటే మావూరు పార్వా–సుశీ–వాళ్యా కళ్ళకుకట్టారు. వాళ్ళని తలుస్తూ ఎంత సేపు కూర్చున్నానో...

ఒక నిట్టూర్పుతో నిరాశచేసుకుని యింకోవైపు తిరిగి సిగరెట్టు వెలిగించుకుంటున్నాను. నా ఎదుట పేపరులో బొమ్మ కనబడుతూవుంది: కొంత ఆశ్చర్యమూ మైకమూ కలిగాయి. అవయవాలన్నీ నీరసించడం వల్ల సిగరెట్టు అవతల పారవేశా.

ఎంతసేపు ఆ స్థితిలోవున్నానో తెలియదు. వెళ్లేటప్పుడు ఆమె పెదవులమీాద చిరునవ్వు మాత్రం చూడగలిగాను—

౨

మర్నాడు నాలుగు రోజులపాటు లీవులెటరు వ్రాసి కాలేజీకి పంపించాను. ఆనాడు 'పాసింగ్‌షో,

టిన్నంతా ఖాళీఅయింది. కొంచెం మనస్థిమితంలోనే పేపరు తీసుకుని 4 గంటలకు పార్కుకువెళ్లాను.

మళ్ళీ ఎదురుగా అదే అమ్మాయి, అదే నవ్వూను...ఆ నవ్వుకు ప్రతిగా నవ్వలేకపోయాను. ఆ నవ్వులో హేళన మాత్రం లేదు. పోతే ప్రేమ...? హృదయాన్ని ఆదరించింది కాని చీల్చలేదు...నిస్సహాయుణ్ణిగా వెంటనే తిరిగి గదికివచ్చాను...

మూడోరోజున ఆమె కనబడలేదు. ఆరాటం హెచ్చింది...

నాలుగోనాడు సాహసించాను...

"మీ పేరు?"......మేరు......

ఏం చదువుతున్నారు...ఫిఫ్త్‌ఫారం.

మీ కులం...మరాఠీ

మీ యిల్లు... దాదర్, పార్సీకాలనీ

నాడు ఆవిడ నాకన్నా ముందు బయలుదేరింది. మామూలు నా చిరునవ్వుయిచ్చి గేటు దగ్గర అదో రకంగాకూడా చూచివెళ్లింది.

హృదయంలో ఆవేదన కెట్టింపయ్యింది. నాగది కూడా పార్సీకాలనీలోనే వుంది...ఆయింటి గుర్తు చూడ్డానికి వెళ్ళాను. కాని యింటివల్ల ఏం ప్రయోజనం...?

పార్కులో మళ్ళీ దర్శనమిచ్చింది. నన్ను ప్రశ్నించడానికి యీవేళ ఆవిడవంతు...

వెళ్ళేటప్పుడు యిద్దరమూ చిరునవ్వులే మాటలుగా కలిసివెళ్లాము...

ఆరాత్రి నా ఆలోచనలకు అంతులేదు.

3

రాత్రి ఏమీతోచక యీ గొడవంతా వ్రాసి ఆఖరుకు ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటం ఖాయం— అని స్నేహితుడికి వుత్తరం పోస్టుచేశాను.

బయటకు వచ్చింతర్వాత కాలు నిలువక ఆ యింటికి వెళ్ళాను.

ఆవిడ 'హలో చౌదరీ' అంటూ ఆహ్వానించింది ఎదురుగా...

అనుకున్న పని అక్షరాలా జరిగింది.

లోపలికెళ్లేటప్పటికి వాళ్ల అన్న కనుపించాడు. నన్ను ఆయనకు పరిచయంచేసి 'టీ' తీసుకు రావడానికి లోపలకు వెళ్లింది.

ఆయన నన్ను పలకరించి ఆఫీసుకు వేళయిందంటూ వెళ్లిపోయాడు.

శని విరగడైపోయిందనుకున్నాను.

'టీ' తాగిన తరువాత "ఆయన మీఅన్నయ్యా" అని ఉపక్రమించాను...

"ఔను"

"మీ తండ్రిగారు?"

"కార్పొరేషన్‌ఆఫీసులో గుమస్తా"

"మీ తల్లి"...

"కాలం చేసింది."

"పెళ్ళి ఎప్పుడు" అని సంకోచిస్తూ అడిగాను.

"నా పెళ్ళి అయి రెండేళ్ళయింది. మా ఆయన 'లా' చదువుతూవున్నాడు"...అని సమాధానం...

నా అవయవాలన్నీ ఒక్కసారి పట్టు తప్పినాయి ఏమి మాట్లాడాలో తెలియదు. గొంతుకపెగలదు. ఆఖరుకు తెంపుచేసుకుని...నేను నిన్నుగూర్చి దురభిప్రాయ పడ్డాను...అని అన్నాను.

"ఎందుకనీ" అంది ఆవిడ ఆలోచిస్తూ... నావంక అలాచూచి నవ్వెందెందుకు?...

'భాయీ' అంది...నాప్రాణం ఎగిరినట్లయింది.. కొంతసేపయిన తరవాత..."ప్రతి స్త్రీనీ ఆవిడ ఎలా చేసినా వేరురకంగా తలచడంతప్పు. ఆపని వ్యభిచారులది. నిన్ను సోదరునిగాచూశాను. యిప్పుడువచ్చిన నష్టమేమీ లేదులే"...అని సర్దింది.

అప్పటికి నాకళ్లు తెరచుకున్నాయి. కాని "సోదరీ" అని పిలవలేక పోయాను.

నన్ను సాగనంపుతూ వరండాలో నా చేయిపట్టుకుని... "అన్నయ్యా, నీవు రోజూ మాయింటికి రావాలి సుమా!" అంది.

యిష్టం లేకపోయినా 'ఊ' అనక తప్పింది కాదు.